పన్ను వసూళ్లకు ప్రత్యేక బృందాలు

- కార్పొరేషన్‌లో బృందాల వారీగా వసూళ్లకు చర్యలు
- రోడ్డెక్కిన అసిస్టెంట్ కమిషనర్, ఇతర యంత్రాంగం
- మొండి బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి



నగరంలోని గృహ, వాణిజ్య సముదాయాలు

విజయనగరం: వివిధ పన్నుల రూపంలో కార్పొరేషన్ ఖజానాకు రావాల్సిన ఆదాయంపై యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకు పాలనపరమైన అంశాలకు సంబంధించి ఎటువంటి నిధులు మంజూరు చేయకపోగా.. స్థానిక సంస్థలే ఆదాయాన్ని సమకూర్చుకోవాలంటూ సూచించింది. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య ఆదేశాలతో అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.తిరుమలరావుతో పాటు రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు రోడ్డెక్కారు. బృందాలు వారీగా వారికి కేటాయించిన ప్రాంతాల్లో పన్ను బకాయిదారులను కలిసి ఒత్తిడి తీసుకువస్తున్నారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 50డివిజన్‌లు ఉండగా... ఆస్తి, నీటి, వాణిజ్య, ఖాళీ స్థలాల ద్వారా పన్నుల ఆదాయం ప్రతి ఆర్థిసంవత్సరం ఖజానాకు జమ అవుతోంది. గత రెండేళ్లుగా పరిశీలిస్తే సచివాలయ ఉద్యోగులు 90 శాతం వరకు పన్నులు వసూలు చేయగలుగుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 100శాతం పన్నులు వసూలు చేయాలంటూ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు అధికార యంత్రాంగం ఆ దిశగా చర్యలు ప్రారంభించింది. బకాయిదారులకు వద్దకు వెళ్లి పన్ను మొత్తం చెల్లించాలని ఒత్తిళ్లు తీసుకువస్తున్నారు. ఇందులో భాగంగా కార్పొరేషన్‌కు చెందిన పాత, కొత్త ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్‌లలో దుకాణాల అద్దె వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు.

మొండి బకాయిలే టార్గెట్‌గా..

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం పన్నుల వసూళ్లలో భాగంగా మొండి బకాయిదారులను టార్గెట్ చేసింది. గడిచిన ఆర్థిక సంవత్సరాల్లో పన్నులు చెల్లించని వారి జాబితాను గుర్తించి వారి వద్దకు నేరుగా అధికారులు, సచివాలయ ఉద్యోగులు వెళ్లి పన్నుల వసూళ్లకు చర్యలు చేపడుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 70,248 వేలకు పైగా అసెస్‌మెంట్‌లు ఉండగా... వాటి ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తం పాత బకాయిలు రూ.20.67 కోట్లు కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.29.35 కోట్లుతో కలిసి రూ.50 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇందులో పాత బకాయిలు రూ.87 లక్షలు వసూలు చేయగా... ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.12.22 కోట్లు వసూలు చేశారు. ఈ లెక్కన రూ.13.09 కోట్లు వసూలు చేయగలిగారు. అదే విధంగా నీటి పన్నులు, ఖాళీ స్థలాలకు సంబంధించిన పన్నులు వసూళ్లలో అధికారులు నిమగ్నమయ్యారు.



అధికారులతో కలిసి పన్నులు వసూలు చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు

ప్రజల ప్రాణాలతో చెలగాటం

- చంద్రబాబు 'విజన్' ఆచరణలో అంధకారం
- కూటమి ప్రభుత్వ వైఫల్యంతో 50 మంది బలి
- విపత్తుల నిర్వహణలో అసమర్థతకు అద్దం
- పబ్లిసిటీ ఘనం – ప్రజాసేవ శూన్యం
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఇరవై ముప్పై ఏళ్ల తర్వాత ఎలా ఉంటుందో ఇప్పుడే ఊహిస్తానంటూ తన విజన్ గురించి పదేపదే గొప్పగా చెప్పుకొనే ముఖ్యమంత్రి చంద్రబాబు వాస్తవానికి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) విమర్శించారు. విజయవాడలో బుడమేరు వరద బాధితులను ఆదుకోవడంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఘోర వైఫల్యాన్ని మంగళవారం ఒక పత్రికా ప్రకటనలో ఎండగట్టారు. చంద్రబాబు విజన్ ఎప్పుడూ ఆచరణలో అంధకారమేనని చెప్పడానికి బుడమేరు వరదలే మరో నిదర్శనమని పేర్కొన్నారు. ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు పడితే లోతట్టు ప్రాంతాల వారికి కనీసం హెచ్చరికలు జారీ చేయాలన్న ప్రాథమిక విషయాన్నీ టీడీపీ కూటమి ప్రభుత్వం విస్మరించడం దారుణమని విమర్శించారు. తీరా బుడమేరు వరదలో చిక్కుపోయిన లక్షలాది మంది విజయవాడ ప్రజలను రక్షించడంలోనూ, బాధితులకు సహాయక చర్యలు చేపట్టడంలోనూ ఘోరంగా విఫలమయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. విపత్తుల నిర్వహణలో చంద్రబాబు అసమర్థతకు ఇదో నిదర్శనమని పేర్కొన్నారు. చివరకు గుక్కెడు మంచినీటికి ప్రజలు అలమటించాల్సిన పరిస్థితి వచ్చిందంటే పాలకుల అసమర్థత కిందే చూడాలన్నారు. ఖజానా ఖాళీగా ఉందని ప్రజలను గాలికి వదిలేసి, ప్రైవేట్ సంస్థల నుంచి కోట్లలో విరాళాలొస్తున్నా పెట్టించుకోలేకపోవడమేమిటని ప్రశ్నించారు. కరకట్టపై నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన రాజసౌధంలో ఉంటూ పరిపాలిస్తున్న చంద్రబాబు ప్రకృతి విపత్తుల గురించి పట్టించుకుంటారంటే ప్రజల అమాయకమే అవుతుందని పేర్కొన్నారు. విజయవాడ వరదలకు చంద్రబాబు నిర్లక్ష్యమే కారణమని, దీనికి ఆయన బాధ్యత వహించాలని డిమాండు చేశారు. చంద్రబాబు 3.0 పాలనలో గోదావరి పుష్కరాల్లో 29 మంది దుర్మరణానికి కారణమైనప్పుడే కనీసం బాధ్యత వహించలేదని గుర్తు చేశారు. కేవలం వీడియో షూటింగ్ కోసం పుష్కరాల రేవులో చావుమోత మోగించారని, ఇప్పుడు సొంత ఇంటి రక్షణ కోసం 50 మంది ప్రజలను బలి చేశారని ఆరోపించారు. మూడ్రోజుల వరద వస్తేనే చంద్రబాబు చేతులెత్తేస్తున్నారని విమర్శించారు. మన రాష్ట్రమే కాదు ప్రపంచమంతా కరోనా మహమ్మారి వణికించినప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండేళ్ల పాటు ప్రజలను రక్షించుకోవడానికి అహోరాత్రులు కష్టపడ్డారని గుర్తు చేశారు. ఆగమేఘాలపై వైద్యసేవలు అందిస్తూ, వలంటీర్ వ్యవస్థ ద్వారా క్షేత్ర స్థాయిలో ప్రజల యోగక్షేమాలు తెలుసుకుంటూ, ప్రజలకు నిత్యావసరాలు అందిస్తూ విపత్తుల నిర్వహణలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారని ప్రశంసించారు. ఇప్పుడు చంద్రబాబు ఆ వలంటీర్ల వ్యవస్థను పక్కనబెట్టేసి తీరా వరదలు వచ్చేసరికి మళ్లీ వాళ్లెక్కడున్నారో వెతుకుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజల వద్దకే రేషన్ సరుకుల కోసం జగనన్న ప్రవేశపెట్టిన ఎండీయూ వాహనాలను వద్దన్న చంద్రబాబే ఇప్పుడు విజయవాడ వరద బాధితులకు తక్షణమే నిత్యావసరాలు అందించడానికి ఉపయోగపడుతున్నాయన్న విషయం గుర్తించాలన్నారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పాలనా విధానాలను అనుసరించడం తప్ప చంద్రబాబుకు మరో మార్గం లేదని సూచించారు. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన ప్రణాళికబద్ధమైన విపత్తుల నియంత్రణ చర్యలు చంద్రబాబుకు చేతగావని పేర్కొన్నారు. వారం రోజులైనా విజయవాడలో సాధారణ పరిస్థితులను తీసురాలేకపోయారని, ఇది చంద్రబాబు ప్రభుత్వ ఘోర వైఫల్యమని మజ్జి శ్రీనివాసరావు విమర్శించారు.

క్లుప్తంగా

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సరోజిని

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని చైర్‌పర్సన్ బంగారు సరోజిని సూచించారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో విద్యుత్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా శిథిలావస్థలో ఉన్న సిమెంట్, ఐరన్ విద్యుత్ స్తంభాలు వెంటనే మార్చాలని, లో ఓల్టేజీ, విద్యుత్ సరఫరా మెరుగుపరచి ట్రాన్స్‌ఫార్మర్ మార్చడానికి చర్యలు తీసుకోవాలని సబ్‌స్టేషన్ ఏఈని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ టివిఎస్.విశ్వేశ్వరరావు, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, ఏఈ పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో వ్యవసాయ విద్యార్థులు



వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఏఓ నిర్మల, వ్యవసాయ కళాశాల విద్యార్థులు

డెంకాడ: నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు మండలంలోని డెంకాడ గ్రామంలో మంగళవారం పర్యటించారు. సాగులో పలు అంశాలపై పరిశీలన, రైతులను నుంచి వాస్తవ స్థితిగతులను తెలుసుకునే కార్యక్రమంలో భాగంగా విచ్చేశారు. దీనిలో భాగంగా డెంకాడ గ్రామంలో వరి పొలాన్ని మండల వ్యవసాయాధికారి పూడి నిర్మలతో కలిసి పర్యటించారు. పంటకు సంబంధించి విత్తన తయారీ దశ నుంచి పంట సాగు చేసి చివరి దశ వరకూ వీరు పలు అంశాలపై తెలుసుకుంటారు. ఆదర్శ రైతుల నుంచి పంట సాగులో తీసుకుంటున్న అన్ని అంశాలపై కూడా వీరు వివరాలు సేకరిస్తున్నారు. కార్యక్రమంలో ఆదర్శ రైతు పాణిరాజు తదితరులు పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన



చేతుల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం ఉన్నత పాఠశాల ఆవరణలో స్వచ్ఛత పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా చేతుల పరిశుభ్రతపై విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎమ్ వేణుగోపాల్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన జీవనానికి చేతులను శుభ్రం చేసుకోవడం ఎంతో అవసరమన్నారు. మూడు పూటలా చేతులను సబ్బుతో శుభ్రం చేసుకొని ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అనంతరం చేతులు శుభ్రపరిచే వివిధ దశలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడు సత్య ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో జూదరులు

విజయనగరం క్రైమ్: స్థానిక కర్రల మార్కెట్ ఆపోజిట్ ఫుట్‌పాత్‌పైన కోత ముక్క పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని వన్‌టౌన్ పోలీసులు మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.14వేల 410 నగదు సీజ్ చేసినట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

విజయనగరం క్రైమ్: స్థానిక అలకానంద కాలనీ వద్ద ఓ మహిళ వ్యభిచార గృహం నడుపుతున్నట్లు అందుకున్న సమాచారంతో దాడులు నిర్వహించామని వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. దాడుల్లో ఇద్దరు విటులు, ఒక బాధితురాలు ఉన్నారన్నారు. ఈ మేరకు నిర్వాహకురాలిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

బాల్య వివాహాలు నేరం

విజయనగరం ఫోర్ట్: బాల్య వివాహాలు నేరమని సీడీపీఓ గులిపల్లి ప్రసన్న అన్నారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో మహిళ సంరక్షక కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు బాల్య వివాహాల నిరోధంపై మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే తల్లిదండ్రులతో పాటు వివాహం జరిపించే పురోహితులు కూడా శిక్షార్హులు అవుతారన్నారు. సదస్సులో అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు, వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ సాయి విజయలక్ష్మి, సూపర్‌వైజర్లు జి.ఎర్రయ్యమ్మ, అనురాధ, టి.త్రినాథ, మేరీవని పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న శంకరరావు

విజయనగరం పూల్‌బాగ్: ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజా ఉద్యమాలే మార్గమని సీపీఎం పార్టీ నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు అన్నారు. ఎల్‌బీజీ నగర్ శాఖా మహాసభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం జెండాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ పాలనలో దేశంలో రాజ్యాంగం దెబ్బ తింటుందన్నారు. అందుకు నిదర్శనం కొత్త న్యాయ చట్టాలని పేర్కొన్నారు. మరో వైపు అధిక ధరలతో ప్రజలు జీవన ప్రమాణాలు దెబ్బతింటున్నాయని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించి అదాని, అంబానీ సేవలో మోదీ భజన బృందం సేవలు చేస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వలేదని, విభజన హామీలు అమలుకు నోచుకోలేదని దుయ్యబట్టారు. సభలో పార్టీ సభ్యులు రమణమ్మ, రమణ, కృష్ణమ్మ, పుణ్యవతి పాల్గొన్నారు.

ఘనంగా సిమ్స్ బాప్టిస్ట్ చర్చి 150వ వార్షికోత్సవం

విజయనగరం టౌన్: సిమ్స్ బాప్టిస్ట్ చర్చి 150వ వార్షికోత్సవం సంఘమిత్ర ఆర్ఎస్.జాన్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. దైవ సందేశాన్ని రెవరెండ్ వై.ప్రభాకర్ అందించారు. తొలి ప్రార్థనను చర్చి అధ్యక్షుడు తాలాడ ఆనంద్ నిర్వహించి, శుభాకాంక్షలు తెలిపారు. శామ్యూల్ రాజ్ బైబిల్‌లో పలు వాక్యోపదేశాలు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హాజరయ్యారు. కేక్ కటింగ్‌ను ఎమ్మెల్యే అదితి గజపతిరాజు చేశారు. ప్రత్యేక ఆహ్వానితులుగా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు పెద్దలను సత్కరించారు. చిన్నారులు, మహిళలు ఆలపించిన క్రీస్తు గీతాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. డేనియల్ గాంధీ, రాజ్‌కుమార్, సిమ్స్ మిషనరీ ప్రతినిధి ఆశాజాన్, క్రీస్తుసోదరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓలు పాపినాయుడు, రాజ్‌కుమార్

పూసపాటిరేగ : మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల ఈ నెల 18, 19 తేదీలలో జరగనున్నాయని విజయవంతం చేయాలని ఎంఈఓలు బి.పాపినాయుడు, ఎ.రాజ్‌కుమార్ కోరారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో వ్యాయామ ఉపాధ్యాయులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అండర్ – 14, అండర్ – 17 కేటగిరిలో బాలురు, బాలికలకు క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా వంటి క్రీడా అంశాలలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులు పోటీలలో పాల్గొనేలా చూడాలని సూచించారు. సమావేశంలో పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్ఎంఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి



వకుల్ జిందాల్, ఎస్పీ, విజయనగరం

విజయనగరం క్రైమ్: జిల్లాలోని ప్రజలు అవసరాల నిమిత్తం బయట ప్రాంతాలకు వెళ్లే సమయాల్లో ఇళ్లల్లో ఎటువంటి దొంగతనాలు జరగకుండా ఉండేందుకు ఎల్‌హెచ్ఎంఎస్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో 43 సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాలనుకున్నప్పుడు ఎల్‌హెచ్ఎంఎస్ సౌకర్యాన్ని ఉచితంగా వినియోగించాలని, దొంగతనాల నియంత్రణలో పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు.

పశువుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

భోగాపురం: పాడి రైతులు పశువుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఉమాశంకర్ మహాపాత్రో అన్నారు. వర్షాలు, వరదలు కారణంగా పశువులు తడిసిన గడ్డి, ఆహారం తినడం, మురుగునీరు తాగడం వలన వాటికి క్షారజనిత అజీర్తి(ఆల్కలైన్ ఇండైజెషన్) వస్తుందని చెప్పారు. రూమెన్‌లోని పి.హెచ్ 7.5 నుండి 9.5 వరకు పెరుగుతుందని, పి.హెచ్ పెరగడం వలన పశువుల్లో రూమెన్ ఫ్లోరా(ఉపకార సూక్ష్మజీవులు) సంఖ్య బాగా తగ్గి అజీర్తికి లోనైన పశువులకు ఆకలి మందగిస్తుందన్నారు. దీంతో పశువుల కడుపులో వాయువు తయారై నోటి నుండి చొంగ, కళ్ల వెంట నీరు కారి శ్వాసక్రియల వేగం పెరుగుతుందన్నారు. తగిన మందులు వాడి జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: మహిళా సాధికారిత కేంద్రంలో సూయింగ్ మెషిన్ ఆపరేటర్, బ్యూటీషియన్, మగ్గం వర్కు, కోర్సులలో శిక్షణ పొందేందుకు అర్హులైన నిరుద్యోగ యువతులు, గృహిణులు దరఖాస్తు చేసుకోవాలని మేనేజర్ విమల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ తరగతులను ఈ నెల 17 నుంచి ప్రారంభిస్తామని తెలిపారు. కోర్సు కాల పరిమితి 2 నెలలు, వయోపరిమితి 18 ఏళ్లు నుంచి 40 సంవత్సరాలని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 13లోగా అందజేయాలని తెలిపారు.

ముక్కాంలో డెంగీ కేసు

భోగాపురం: మండలంలోని ముక్కాం గ్రామానికి చెందిన నాలుగేళ్ల చిన్నారికి డెంగీ సోకిందని సీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి వెంకటేష్ మంగళవారం తెలిపారు. మెరుగైన వైద్య పరీక్షల కోసం చిన్నారిని విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. గత జూలై, ఆగస్టు నెలల్లో కూడా ఇదే గ్రామానికి ఐదుగురు డెంగీ వ్యాధి బారిన పడ్డారని ఆయన తెలిపారు.

గణనాథునికి నృత్య నీరాజనం



రామనారాయణంలో నృత్య నీరాజనం చేస్తున్న విద్యార్థులు

విజయనగరం టౌన్: గణపతి నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని రామనారాయణం ప్రాంగణంలో శ్రీసూర్య అకాడమీ విద్యార్థులు నృత్య నీరాజనం సమర్పించారు. అకాడమీ ఫౌండర్ టివి.రామ్‌కాశ్యప్ ఆధ్వర్యంలో ఐశ్వర్యజ్యోతి బృందం చేసిన నృత్య ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. అనంతరం కళాకారులందరికీ ప్రశంసపత్రాలను, నాట్యగురువులకు సత్కారాలు చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లను పరిశీలించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ రమణమూర్తి

భోగాపురం: మండలంలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులు ఉపయోగిస్తున్న మరుగుదొడ్లను వారంలో రెండు రోజులు పరిశీలించి ఫొటోలను ప్రభుత్వానికి సంబంధించిన యాప్‌లలో అప్లోడ్ చేయాలని ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు ఎంఈఓ రమణమూర్తి సూచించారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులు జీపీఎస్ ఆధారంగా ఎప్పుడు ఏ సమయంలో పాఠశాలల తనిఖీకి వస్తారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. గతంలో అధికారులు పాఠశాలలు తనిఖీకి వచ్చేటప్పుడు సమాచారం అందించేవారని ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవన్నారు. వారంలో రెండు రోజులు సచివాలయ వెల్ఫేర్ సిబ్బంది, మరో రెండు రోజులు స్కూల్ కమిటీ సభ్యులు, మిగిలిన రెండు రోజులు పాఠశాలల్లోని ఉపాధ్యాయులు మరుగుదొడ్లను పరిశీలించి ఫొటోలను ప్రభుత్వం సూచించిన యాప్‌లలో అప్లోడ్ చేయాలని సూచించారు. సమావేశంలో ఎంఈఓ-2 బి.చంద్రమౌళి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల కూచిపూడి నృత్య ప్రదర్శన



విద్యార్థుల నృత్య ప్రదర్శన

విజయనగరం టౌన్: స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యార్థులు నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. శ్రీకాకుళానికి చెందిన డాక్టర్ ఆర్.శ్రీకాంత్ నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. కళాశాల విద్యార్థులు నిర్వహించిన డోలు లయ విన్యాసం చూపరులను రక్తి కట్టించింది. డోలుపై సురేష్, శివకుమార్, మనోజ్, హేమంత్ కుమార్, అవినాష్ సహకరించారు. సహాయ డోలు అధ్యాపకులు ఎ.శ్రీనివాసులు నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమాలను కళాశాల ప్రిన్సిపల్ పివిఎవిఎస్.శాస్త్రి పర్యవేక్షించారు.

పైడితల్లి మహిమలను చాటిచెప్పాలి

- అమ్మవారి ప్రచార రథం ప్రారంభించిన ఎమ్మెల్యే అదితి గజపతిరాజు



పైడితల్లి అమ్మవారి ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం టౌన్: సిరుల తల్లి పండగ తేదీలు ఖరారయ్యాయి. అమ్మవారి ఉత్సవానికి సంబంధించి ఊరూర తిరిగి ప్రచారాన్ని నిర్వహించే ప్రచార రథాన్ని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మంగళవారం ఆలయం వద్ద జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పైడితల్లి ప్రజలందరి తల్లి అని, ఆ అమ్మవారి మహిమలను, గొప్పతనాన్ని చాటిచెప్పాలన్నారు. ప్రతీ ఏటా ప్రచార రథం ఉత్తరాంధ్ర అంతా కలియతిరిగి భారీ ఎత్తున ప్రచారం చేస్తుందన్నారు. అమ్మవారి దీక్షలు చేసే దీక్షాధారులు పెరగాలన్నారు. పైడితల్లి అమ్మవారి పండగను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. 2017లోనే తమ ప్రభుత్వం రాష్ట్ర పండగగా ప్రకటించిందన్నారు. రాష్ట్ర పండగ నేపథ్యంలో అమ్మవారి పండగను ఈ ఏడాది అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సన్నద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమానికి ముందు ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు నేతృత్వంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఐవిపి.రాజు, అవనాపు విజయ్, పైడిమాంబ కళాపీఠం వ్యవస్థాపకులు ఆర్.సూర్యపాత్రో, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు పాల్గొన్నారు.

నీట మునిగిన పంట పొలాల పరిశీలన



నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న ఏఓ హరికృష్ణ తదితరులు

భోగాపురం: మండలంలోని లింగాలవలస, చెరుకుపల్లి రెవెన్యూ గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలు కారణంగా నీట మునిగిన పంట పొలాలను మండల వ్యవసాయ శాఖ అధికారి వి.హరికృష్ణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ హరికృష్ణ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల వలన వరద నీరు ఎక్కువగా కాలువల నుంచి పొంగి పొలాల పైనుంచి ప్రవహించడంతో సుమారు 40 ఎకరాల్లో రైతులు వేసిన వరి పంట నీట మునిగిందన్నారు. పొలాల్లోని నీరు క్రమేపి తగ్గుతుందని, మరో రెండురోజుల్లో నీరు పూర్తిగా బయటకు వెళ్లిపోతుందన్నారు. నీరు తగ్గిపోయిన తరువాత బూస్టర్ డోస్ కింద ఒక ఎకరానికి 25 కేజీల యూరియ, 20 పొటాష్ చొప్పున వేసుకోవాలని సూచించారు. పరిశీలనలో గ్రామ వ్యవసాయ సహాయకులు మరియు రైతులు పాల్గొన్నారు.

నష్టం అంచనాల్లో అధికారులు



నెల్లిమర్ల రూరల్: కొత్తపేటలో నీట మునిగిన వరి పంట పొలాలను పరిశీలిస్తున్న ఏఓ పూర్ణిమ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామంలో నీట మునిగిన వరి పంటలను ఏఓ పూర్ణిమ తమ సిబ్బందితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండల వ్యాప్తంగా సుమారు 20.2 ఎకరాల్లో పంటలు నీట మునిగినట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. నీట మునిగిన వరి పంట వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని చెప్పారు. చెరువు గట్లకు ఆనుకొని ఉన్న పంట పొలాల్లో ఎక్కువగా నీరు చేరిందన్నారు. నీట మునిగిన పంటలను ప్రాథమిక పంట నష్టంగా గుర్తించామని, రెండు రోజుల్లో నీరు కాలువల ద్వారా బయటకి వెళ్లే అవకాశం ఉందన్నారు. అప్పటికీ నీరు వెళ్లకపోతే 35 శాతం మేర నష్టం కలిగిన పంటను గుర్తిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పూసపాటిరేగలో...

పూసపాటిరేగ: మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలు గ్రామాల్లో వరి పంట ముంపునకు గురైంది. కుమిలి గ్రామంలో 83 ఎకరాలు, చౌడువాడలో 33 ఎకరాలు, గోవిందపురంలో 25 ఎకరాలు, చల్లవానితోటలో ఎనిమిదెకరాలు ముంపునకు గురైనట్టు ఏఓ కొల్లి నీలిమ తెలిపారు. రాయుడుపేటలో వర్షాలకు కల్యాణపు వెంకటేష్‌కు చెందిన ఇల్లు కూలిపోయింది.